పదిహేను రోజులు గడిచాయి.

ఆ రోజు సాయంత్రం సుబ్బారావు ఇంటికి రాగానే భార్య అందుకుంది - "చూశారా... వద్దంటూనే ఉన్నానా! పాపం మురళిగారి భార్యకి దయ్యం పట్టింది" అంటూ.

"ఏమిటి నీ కేమైనా పిచ్చెక్కిందా?" అన్నాడు సుబ్బారావు తన చెవులను నమ్మలేక.

"నిజమేనండీ.. నేను చెప్తోంది. ఓసారి వెళ్ళి చూసిరండి" అంది ఆమె.

వెంటనే సుబ్బారావు మురళి ఇంటికి వెళ్ళాడు.

సుబ్బారావును చూస్తూనే మురళి బయటకు వచ్చాడు. అతని ముఖంలో కళ లేదు. పాలిపోయి ఉంది.

"ఏమిట్రా నేను విన్నది నిజమేనా?" అంటూ ఆత్రంగా అడిగాడు సుబ్బారావు.

మౌనంగా అతని భుజం మీద చేయి వేసి డాబామీది కెళ్ళాడు మురళి.

"ఇదంతా నా స్వయంకృతంరా... అనుభవింపక తప్పదు. అందుకే అన్నారు పెద్దలు-చెరపకురా చేడేవు అని" అంటూ దీనంగా మాట్లాడాడు. ఆ మాటలంటూంటే అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఏమిట్రా నువ్వనేది... నా కసలు అర్థం కావడం లేదు. ఏమి జరిగిందో సరిగ్గా చెప్పు" అన్నాడు కంగారుగా సుబ్బారావు.

"చెప్తాను. నీ క్కాకపోతే ఎవరికి చెప్తాను. చేసిన పాపం చెప్తే కొంతయినా తగ్గుతుంది" అంటూ బరువుగా నిట్టూర్చాడు మురళి. "ఆ రోజున నీతో అన్నానా ఎలాగయినా నెల తిరక్కుండా ఈ ఇంట్లోకి వస్తానని. ఆ ఆలోచనే నా మనసులో గూడు కట్టుకుపోయింది. ఎలాగైనా నేను కోరుకున్నది సాధించా లనుకున్నాను. బాగా ఆలోచించి ఒక పథకం వేశాను. ఆ ఇల్లు దయ్యాల కొంప అనీ, అంతకు ముందు అక్కడ ఉండిన పాడుపడిన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారనీ, వాళ్ళు దయ్యాలై ఆ ఇంట్లో తిరుగుతున్నారనీ ఒక ప్రచారం లేవదీసి ఇరుగుపొరుగు ఆడవాళ్ళ చెవిన పడేటట్లు చేశాను. ఇంకేముంది - ఆ వార్త హుటాహుటిన ఆ ఇంట్లో ఉన్నామె చెవులకి సోకింది. దాంతో అంతవరకూ లేనిది ఆమెకు చీటికి మాటికి దయ్యాలు కనిపిస్తుండడం, భయపడి జ్వరం వస్తుండడం పరిపాటి అయింది. ఈ బాధ పడలేక వాళ్ళు ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయారు. అవన్నీ జాగ్రత్తగా గమనిస్తుండిన నేను సమయం చూసి పరంధామయ్యగారిని కలిసి ఇంటిని ఖాయం చేసుకుని వచ్చి చేరాను" అన్నాడు.

"మరి ఈ లేని దయ్యాలు మీ ఆవిడ కెలా కనిపించాయి?" అని ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

'ఇరుగు పొరుగు అమ్మలక్కలు 'ఇదేమిటమ్మా... చూస్తూ.... దయ్యాల కొంపలోకి అడుగు పెట్టారు. పాతవాళ్లు ఉండలేకనా వెళ్ళిపోయింది. నెలతిరక్కుండా ఖాళీచేశారు' అంటూ బుగ్గలు నొక్కుకుంటూ దరువులు వేశారు. అంతే మా ఆవిడకీ దయ్యాలు కనిపించడం మొదలు పెట్టాయి' అన్నాడు మురళి తల చేత్తో పట్టుకుని

'అయ్యో కర్మ.... మరి నువ్వు ఈ ఇంట్లోకి వచ్చేముందు ఈవిషయం మీ ఆవిడకి చెప్పలేదూ?'

"లేదు... ఎలా చెప్తానురా-చేసింది తప్పుడు పని అయినప్పుడు. చెప్పడం అవసరమని కూడా అనిపించలేదు. దగ్గర స్నేహితుడివి నీకు మాత్రం చెప్పగలిగానా? మా ఆవిడ ఇంత మంచి ఇంటిని వాళ్ళు ఎందుకు ఖాళీ చేశారో ఆశ్చర్యపోతుంటే- మాట దాటేస్తూ వచ్చాను. కాని అమ్మలక్కల ద్వారా ఈ దయ్యాల గొడవ మా ఆవిడ చెవిన పడ్తుందని నాకు అనిపించలేదు. ఆ తర్వాత నిజం చెప్పినా ఆవిడ నమ్మడం లేదు. మంచి ఇల్లు వదులుకోవడం ఇష్టంలేక అబద్ధాలు కల్పించి చెప్తున్నా ననుకుంటోంది" అనాడు మురళి.

"అయ్యో... మరి ఇప్పటి పరిస్థితి ఏమిటి?" అన్నాడు సుబ్బారావు ఆత్రంగా.

"నిన్న రాత్రి బాగా ఝడుసుకుంది. అప్పటి నుంచీ ఇంచుమించు స్పృహలో లేదు. స్పృహవచ్చినా వెర్రి చూపులు చూస్తూ, పిచ్చి మాటలు మాట్లాడుతోంది. డాక్టరు చూసి 'ఇల్లు మారిస్తేనేకాని ఆమెకి నయం కా'దన్నాడు అన్నాడు మురళి దిగులుగా.

"అరే అందుకేనా...ఈరోజు నువ్వు ఆఫీసుకి రాంది. సరే ఇప్పుడేమిటి చేయడం?" అన్నాడు సుబ్బారావు ఆత్రంగా.

"ఏముందీ... ఈ ఇల్లు ఖాళీ చేస్తున్నాను. మళ్ళీ పాత ఇంటికే వెళ్తున్నాను. ఇందాక వెళ్ళి ఖాయం చేసుకొచ్చా" అన్నాడు మురళి.

"మరి ఇచ్చాడా?" అన్నాడు సుబ్బారావు ఆశ్చర్యంగా.

"అ...ఆ ఇల్లు ఇంకా ఖాళీగానే ఉంది. అంత దూరాన ఉన్న ఇంటికి కంగారుపడి అంత త్వరగా ఎవరు వస్తారు?" అన్నాడు మురళి.

"అది నీ అదృష్టమే ననుకోవాలి. ఎవరైనా వచ్చి ఉంటే ఇది ఖాళీ చేయలేక, కొత్తది దొరక్క బాధపడవలసి వచ్చేది. అది సరే! ఇంతకీ ఆ పాత ఇంటాయన ఏమైనా సణిగాడా! ఏమీపేచీ పెట్టకుండానే ఇచ్చాడా?" అన్నాడు సుబ్బారావు ఆశ్చర్యంతో

'సణుగుడూ లేదు, పేచీ లేదు. కాకపోతే ఓ వందరూపాయలు అద్దె ఎక్కువ చేశాడు. ఏం చేస్తాం. అవసరం మనది-తేలుకుట్టిన దొంగల్లే నోరెత్తకుండా ఒప్పుకొని అడ్వాన్స్ ఇచ్చి వచ్చాను' అన్నాడు మురళి తల దించుకొని.

సుబ్బారావు ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాడు.

మురళి సామానుని బయటకు తెచ్చి బండి ఎక్కిస్తూంటే జాలిగా చూస్తుండిపోయాడు.

